


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 17.07.2026 | సంపుటి: 3 | సంచిక: 165 | పేజీలు: 8 | వెల: 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 17.07.2026 | VOLUME : 3 | ISSUE : 165 | PAGES: 8 | COST: 2/- |




## అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, కేవలం సగం పదవీకాలం పూర్తికాకముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 2వ పేజీలో..

# గోల్కొండలో ఘనంగా బోనాల జాతర ప్రారంభం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ప్రభుత్వ తరపున తొలి బంగారు బోనం సమర్పణ
- ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల చెక్కు అందజేత
- పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో భక్తి పారవశ్యం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

భాగ్యనగర సంస్కృతికి ప్రతికగా నిలిచే గోల్కొండ కోటలో ఆషాఢ మాస బోనాల జాతర గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వ తరఫున పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి కొండా సురేఖకు సంప్రదాయబద్ధంగా బోనం అందించడం విశేష ఆకర్షణగా నిలిచింది. అనంతరం

మిగతా 2వ పేజీలో..

## బోనాల జాతర.. ప్రజలకు బీజేపీ శుభాకాంక్షలు

2



## క్రీడల అభివృద్ధికి పెద్దపీట..

- తెలంగాణలో ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ: సీఎం రేవంత్ రెడ్డి
- టీజీ-20 విజేత హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టుకు నగదు ప్రోత్సాహకాలు
- క్రీడాకారులకు క్యాష్ రివార్డులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు
- గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి
- గ్రామీణ క్రీడాకారులకు టీజీ-20 మంచి వేదిక

2





## సామాజిక ఐక్యతకు ప్రతీకగా బోనాల పండుగ: సీఎం

2

## ప్రాణహితకు మళ్లీ ప్రాణం

- సీతారామ, సీతమ్మసాగర్, దేవాదుల కాంగ్రెస్ హయాంలోనే పూర్తి
- ఖమ్మం ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం
- అన్ని అడ్డంకులను తొలగించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



## గోదావరి జలాలపై ప్రత్యేక ప్రణాళిక

3

- చివరి ఆయకట్టుకూ నీరందించడమే లక్ష్యం
- ప్రజా ప్రభుత్వంలో పైసా వృథా కాకుండా 'సీతారామ' పూర్తి
- సీతారామపై క్షేత్రస్థాయి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

## అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

కాంగ్రెస్ తీరువల్ల విద్యుత్ కేంద్రాల్లో పడిపోయిన ఉత్పత్తి

నీటిని ఎత్తిపోయలేదు.. రిజర్వాయర్లు నింపలేదు

ఇతర రాష్ట్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా

తెలంగాణకు తక్కువ రకం బొగ్గు ఎందుకిస్తున్నారు?

పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు

ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు

2






## కాంగ్రెస్‌లో భజన సంస్కృతికి బ్రేక్..

- పాలాభిషేకాలు, జేసీబీ గజమాలలకు నో
- పాలాభిషేకాలు, నీటి అభిషేకాలను నిషేధించిన టీపీసీసీ
- జేసీబీలు, బుల్డోజర్లతో భారీ గజమాలలకు ఆంక్షలు
- ఆహార వృథాకు బదులుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- ఆదేశాలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యల హెచ్చరిక

3

## హోంవర్క్ పై వివాదం.. టీచర్‌ను తొలగించిన పాఠశాల

- రెండో తరగతి విద్యార్థికి 'సూరా ఫాతిహా' హోంవర్క్ ఇవ్వడంపై వివాదం
- తల్లిదండ్రుల నిరసనతో టీచర్‌ను తొలగించిన యాజమాన్యం
- ఇతర మతాల విద్యార్థులకు 'దీనియాత్' బోధించబోమని వివరణ
- ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందన

3



## కల్మా చదవాల్సిన అవసరం లేదు

- సైదాబాద్ స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- మిగతా స్కూళ్లపై నిఘా పెంచాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్

3

## హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం

- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ప్రకటన
- సైదాబాద్ పాఠశాల ఘటనపై కేంద్ర మంత్రి ఆగ్రహం
- పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్
- స్కూల్ వద్ద ఉద్రిక్తత.. భారీ పోలీసు బందోబస్తు

3

## పాతబస్తీలో డ్రగ్స్ కలకలం..

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కుమారుడు సహా ముగ్గురి అరెస్ట్

మంగళహాట్ పరిధిలో పోలీసుల ఆకస్మిక దాడులు

24 గ్రాముల హాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయి స్వాధీనం

మరో నలుగురు నిందితులు పరారీలో

రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించిన పోలీసులు

2



## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు



4



## విద్యుత్ వెలుగుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- మంత్రి చొరవతో 90 శాతం కేంద్రాలకు ఉచిత విద్యుత్
- ఆరు నెలల్లోనే 9,800 కేంద్రాలకు సౌకర్యం
- భవిష్యత్ తరాలకు విద్యుత్ ఇవ్వని గత ప్రభుత్వం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చీకట్లు తొలగిపోతున్నాయి. చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల

మిగతా 3వ పేజీలో..

# గోల్కొండలో ఘనంగా బోనాల జాతర ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ తరపున తొలి బంగారు బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం రూ.11 లక్షల విలువైన చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాల ప్రారంభంతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలు భక్తి పారవశ్యంతో మార్మోగాయి. శివసత్తుల పూనకాలు, పోతురాజుల వీర విన్యాసాలు, డప్పు చప్పుళ్లు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను తిలకించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోల్కొండ కోటలో బోనాల జాతర ప్రారంభం కావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృత చర్యలు చేపట్టారు.

# సామాజిక ఐక్యతకు ప్రతీకగా బోనాల పండుగ: సీఎం రేవంత్ రెడ్డి

- బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయింపు
- భక్తులకు అన్ని సౌకర్యాలతో విస్తృత ఏర్పాట్లు
- 3 వేలకుపైగా ఆలయాల్లో ఆగస్టు మధ్య వరకు వేడుకలు
- భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపు

హైదరాబాద్, జూలై 16

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేలాది ఆలయాల్లో గురువారం ఘనంగా ప్రారంభమైన బోనాల జాతర భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోందన్నారు.

బోనాల పండుగ తెలంగాణ సామాజిక ఐక్యతకు ప్రతీక అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఆలయాల వద్ద పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మహంకాళి అమ్మవారికి అంకితమైన ఈ బోనాల ఉత్సవాలను దేవాదాయ శాఖ పరిధిలోని 3 వేలకుపైగా ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆగస్టు మధ్య వరకు వివిధ ప్రాంతాల్లో ఈ వేడుకలు కొనసాగనున్నాయని పేర్కొంది.

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది పలు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా బోనాల ఉత్సవాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాల్లో పాల్గొని మహంకాళి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# బోనాల జాతర.. ప్రజలకు బీజేపీ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 16 :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం, గంగజమున తహజీబ్‌కు ప్రతీక అయిన చరిత్రాత్మక ఆషాఢ బోనాల జాతర ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల ఆత్మగా నిలిచే ఈ బోనాల పండుగ మన జానపద వైభవానికి, భక్తిశ్రద్ధలకు నిదర్శనమన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే తొలి బోనంతో ప్రారంభమై.. లష్కర్ మహంకాళి జాతర, పాత బస్తీ లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారి ఉత్సవాల వరకు సాగే ఈ సంబురం యావత్ తెలంగాణకు ఒక సరికొత్త పండుగ వాతావరణాన్ని, ఉత్తేజాన్ని తీసుకువస్తుందని తెలిపారు. ఆ అమ్మవారి చల్లని చూపుతో రాష్ట్రంలోని అన్నదాతలు, శ్రామికులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, మన రాష్ట్రం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని ఆ జగన్మాతను మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ప్రజలందరూ ఈ జాతరను భక్తిశ్రద్ధలతో, అత్యంత సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. ఈరోజు పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారాయని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతులు సాగునీటి కోసం అడుగుతుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి "రక్తం పారిస్తా" అన్నట్లుగా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉండగా, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరిలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని పేర్కొన్నారు. చివరకు రైతులు కూడా "మా రక్తాన్ని తీసుకోండి... కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి" అని డిమాండ్ చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. యువత, నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరిట భారీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎప్పటికప్పుడు ఆ మోసాన్ని ఎండగడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు.

వరంగల్ రైతు సభ అనంతరం, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ సదస్సు ఏర్పాట్లపై నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు.

# ఆత్మహత్య చేసుకున్న పోక్సో కేసు నిందితుడు

కామారెడ్డి, జూలై 16 :

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య కలకలం రేపింది. రంగబోయిన సందీప్ (23) గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో పోక్సో కేసులో నిందితుడైన ఇతను ఇటీవలే జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు తనను తరచూ వేధిస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గ్రామ శివారులో సందీప్ మృతదేహం వేలాడుతుండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. బాలిక కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని సందీప్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణం వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోమకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.





# కాంగ్రెస్‌లో భజన సంస్కృతికి బ్రేక్..

హైదరాబాద్, జూలై 16

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో భజన సంస్కృతికి, ఆడంబరాలకు అడ్డుకట్ట వేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యక్రమాల్లో నేతలకు పాలాభిషేకాలు చేయడం, జేసీబీలు, బుల్డోజర్లు వంటి భారీ యంత్రాలతో గజమాలలు వేయడాన్ని పూర్తిగా నిషేధిస్తూ అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంతకంతో విడుదలైన సర్క్యులర్ ప్రకారం, తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నైతిక విలువలకు అనుగుణంగా ఆహార పదార్థాలను వృథా చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొంటూ, పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమంలోనూ పాలతో లేదా నీటితో అభిషేకాలు చేయరాదని స్పష్టం చేశారు.

సమాజంలో ఇప్పటికీ అనేక మంది పోషకాహార లోపంతో బాధపడుతున్న నేపథ్యంలో పాలను వృథా చేయడం సమంజసం కాదని టీపీసీసీ అభిప్రాయపడింది. పాలాభిషేకాల వంటి కార్యక్రమాలకు బదులుగా పేదలకు, అవసరమైన వారికి ఆహార పదార్థాలు పంపిణీ చేయడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించింది. ఇటీవల రాజకీయ సభల్లో జేసీబీలు, బుల్డోజర్లు, క్రేన్లతో భారీ గజమాలలు వేయడం పెరుగుతున్న నేపథ్యంలో వాటిపైనా టీపీసీసీ ఆంక్షలు విధించింది. ఈ తరహా ప్రదర్శనలు పార్టీ సంస్కృతికి విరుద్ధమని పేర్కొంటూ, ఇకపై అలాంటి కార్యక్రమాలకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించి నేతలకు జేసీబీలు, క్రేన్ల ద్వారా గజమాలలు వేయడం లేదా పాలాభిషేకాలు నిర్వహించిన వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ హెచ్చరించింది. ఈ సర్క్యులర్‌ను రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు పంపిస్తూ క్షేత్రస్థాయిలో నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించింది.

# క్రీడల అభివృద్ధికి పెద్దపీట..

హైదరాబాద్, జూలై 16



తెలంగాణలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇటీవల విజయవంతంగా ముగిసిన సీజన్ 1 టీజీ20 క్రికెట్ లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అభినందించిన ముఖ్యమంత్రి వారికి నగదు ప్రోత్సాహకాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని రూపొందించి అమలు చేస్తున్నామని, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు హైదరాబాద్ వేదికగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు టీజీ20 క్రికెట్ లీగ్ మంచి అవకాశంగా మారిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులను అభినందిస్తూ, భవిష్యత్తులో దేశానికి కీర్తి తీసుకువచ్చే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే లక్ష్యంపై పూర్తి దృష్టి, క్రమశిక్షణ, అంకితభావం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. తాము ఎంచుకున్న రంగాన్ని గౌరవిస్తూ నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీలో డ్రగ్స్ కలకలం..

హైదరాబాద్, జూలై 16

హైదరాబాద్ పాతబస్తీలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. మంగళహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్ రామిరెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డి కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పురానాపూల్ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల కొనుగోలు కోసం మొత్తం ఏడుగురు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే పోలీసుల రాకను గమనించిన నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, బొట్టు యూనిత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 24 గ్రాముల హాష్ ఆయిల్ సాచెట్లు, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో సోనీ, వంశీ, మనోజ్, తుల్జాసింగ్ అనే మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన ముగ్గురికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కౌన్సెలింగ్ కోసం రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. ఈ ఘటనపై మంగళహాట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను మరింత బలోపేతం చేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థల సహాయంతో డ్రగ్స్ విక్రయించే వారితో పాటు కొనుగోలు చేసే వారిపైనా ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా మొదటిసారి డ్రగ్స్ వినియోగిస్తున్న వారిని రిహాబిలిటేషన్ సెంటర్లకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తూ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నారు. డ్రగ్స్ కేసుల్లో ఎంతటి ప్రముఖులు ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పోలీసు శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ధూల్‌పేట్, మంగళహాట్, పాతబస్తీతో పాటు ఐటీ కారిడార్ ప్రాంతాల్లో కూడా పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. గంజాయి, హాష్ ఆయిల్, ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

హైదరాబాద్, జూలై 16:

రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్ల రాష్ట్రం అంధకారం అయ్యే పరిస్థితి వచ్చింది. అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారస్థులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కరెంట్ పోతే వార్త.. ఇప్పుడు కరెంట్ ఉంటే వార్త అన్న పరిస్థితి నెలకొందని, నేడు 11 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముందు రైతాంగం ధర్నాలు చేసిందని అన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్లే కరెంట్ కోతలు వస్తున్నాయన్నారు. సింగరేణి విషయంలో పీపీటీలు పెట్టి థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు లేవని ముందే చెప్పాం.. 40 లక్షల టన్నుల బొగ్గు ఉందని ప్రభుత్వం చెప్పింది.. వాస్తవానికి లేదని మేం హెచ్చరించాం.అని విమర్శించారు.. బీఆర్ఎస్ నిద్ర లేపినా కూడా ప్రభుత్వం నిద్ర లేవలేదు. కాంగ్రెస్ తీరు వల్ల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లలో 6-7 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవు. యాదాద్రి ప్లాంట్‌లో యూనిట్ 1, యూనిట్ 4లో బొగ్గు లేక ఉత్పత్తి నిలిచిపోయింది. భద్రాద్రి ప్లాంట్‌లో నిర్వహణ వైఫల్యంతో ఉత్పత్తి ఆగిపోయింది. అసలు విద్యుత్ కోతలు ఎందుకు వస్తున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రాష్ట్రంలో లోడ్ కేవలం 15 వేల మెగావాట్లు మాత్రమే ఉంది. 7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి జరగడం లేదు. నిన్న కేవలం 3,190 మెగావాట్ల సామర్థ్యం మేర ఉత్పత్తి జరిగింది. అంటే సగం సామర్థ్యం కూడా వినియోగించడం లేదు. ఉన్న సామర్థ్యంలో కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.. 56 శాతం సామర్థ్యాన్ని వినియోగించడం లేదు. బొగ్గు సరఫరాలో వైఫల్యం నీటి నిల్వల నిర్వహణలో వైఫల్యం విద్యుత్ కేంద్రాల నిర్వహణలో వైఫల్యం బొగ్గులో స్కాం పవర్‌లో స్కాం సాండ్‌లో స్కాం ల్యాండ్‌లో స్కాం కాంగ్రెస్ పాలన అంతా స్కాముల మయంగా మారిందన్నారు. రాష్ట్రం మీద అసలు సోయి ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గి సరఫరా తగ్గింది. అందుకే రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ కోతలు పెడుతున్నారు. నీటిని లిఫ్ట్ చేయలేదు.. రిజర్వాయర్లలో నీళ్లు నింపలేదు.. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని కూడా అసాధ్యం చేశారు. ముందస్తు ఆలోచనతో అయినా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సజావుగా జరిగేలా చూడలేదు. సాగునీటి సరఫరాలో ఫెయిల్ అయ్యారు.. విద్యుత్ సరఫరాలో కూడా ఫెయిల్ అయ్యారు. తెలంగాణకు మొత్తంగా 23 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉంది. అయినా ప్రస్తుతం కేవలం 3,190 మెగావాట్లే ఉత్పత్తి అవుతోంది. దీనికి కారణమేంటో ప్రభుత్వం చెప్పాలి. అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పవర్ ఎక్స్చేంజ్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఆ భారం వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు ఎందుకు భరించాలని ప్రశ్నిస్తున్నాం. సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి, సరఫరా, బొగ్గు నాణ్యత వివరాలు బయటకు రాకుండా చేశారు. నాణ్యమైన సింగరేణి బొగ్గును తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు పంపుతున్నారు. తెలంగాణకు మాత్రం లోక్వాలిటీ బొగ్గు పంపిస్తున్నారు.. 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయి. అందుకే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి జరగడం లేదు. రాష్ట్ర అవసరాలు, రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎందుకు పంపిస్తున్నారో ప్రభుత్వం చెప్పాలి. మీ దగ్గర బొగ్గు ఉండి కూడా అడ్డగోలు ధరలకు పవర్ ఎక్స్చేంజ్‌లో విద్యుత్ ఎందుకు కొనుగోలు చేస్తున్నారో సమాధానం చెప్పాలి. ఎందుకు కేవలం 44 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది. లోవోల్టేజ్, మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. త్రీ ఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు రాత్రంతా పొలం వద్ద జాగారం చేయాల్సి వస్తోంది. ఇందిరమ్మ పాలన అంటే సమైక్య రాష్ట్రం నాటి విద్యుత్ కష్టాలను మళ్లీ తీసుకురావడమేనా? పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా కరెంట్ కోతలే ఉన్నాయి. రైతులు మాత్రమే కాదు.. చిన్న వ్యాపారులు, విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో గంటల తరబడి కరెంట్ ఉండడం లేదు. విద్యార్థులు రాత్రి సమయంలో చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రుణమాఫీ సగం చేసి.. సగం మంది రైతులను వదిలేశారు. రైతు భరోసాను సీజన్లకు సీజన్లు ఎగ్గొట్టారు. యూరియా, ఎరువుల సరఫరాలో కోతలు విధించారు. పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో కోతలు విధించి రైతుల జీవితాలతో ఆటలాడుతున్నారు. మీది కోతల సర్కార్... వాతల సర్కార్. గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చిన తర్వాత 3 వేల మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆ దరఖాస్తులు ఎందుకు క్లియర్ చేయలేదో ప్రభుత్వం చెప్పాలి. కమిషన్లు తేలక ఆపారా? లేక ఇంకేదైనా కారణం ఉందా? కమిషన్ల కక్కుర్తితో గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలు చేయకుండా పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెడుతున్నారు. వెంటనే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలి. థర్మల్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు సరఫరా చేయాలి. రాష్ట్రంలోని రైతులందరికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే రైతాంగం తరపున బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని హెచ్చరిస్తున్నాం. ఖమ్మం జిల్లాలో ఈరోజు మంత్రులు ప్రారంభించిన సీతారామ మోటార్లు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసినవే. కేసీఆర్ పెట్టిన మోటార్లకు కాంగ్రెస్ ప్రభుత్వం స్విచ్ వేయడానికి మాత్రమే వెళ్తోంది. మొన్న దేవాదుల ప్రాజెక్టుకు కూడా అలాగే వెళ్లారు. సీతారామ ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఉద్యోగ సంఘాల నాయకులు దేవి ప్రసాద్ పాల్గొన్నారు.

# గోదావరి జలాలపై ప్రత్యేక ప్రణాళిక

**ఖమ్మం/హైదరాబాద్, జూలై 16 :**

గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గ్రావిటీ, లిఫ్ట్ ద్వారా గరిష్ఠంగా వినియోగంలోకి తీసుకు రావాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ముందుకు వెళుతున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతమ్మ సాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు ను మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా వస్తున్న వాతావరణ మార్పులు, విపత్కర పరిస్థితులను తట్టుకునేలా ముందే ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. మూడు రోజుల క్రితం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సమ్మక్క బారేజ్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేసేందుకు అన్ని పంపులను ఆన్ చేయడమే కాక దాదాపు 12 జిల్లాలు, 17 నియోజకవర్గాలకు సంబంధించి 22 రిజర్వాయర్లను నింపే కార్యక్రమానికి స్వయంగా అక్కడే ఉండి సమీక్ష నిర్వహించామని తెలిపారు. ఇవాళ సీతారామ ప్రాజెక్టు వద్దకు వచ్చి సమీక్షించి ఎక్కడికక్కడే ఆదేశాలు ఇస్తూ పనులు వేగవంతం చేసే ప్రక్రియ చేపట్టామన్నారు.

తెలంగాణ ప్రాంతంలో గోదావరి నదిపై ఉన్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆనాడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోదావరి జలాలను జిల్లా రైతులకు అందించాలనే ఉద్దేశంతో లోతుగా అధ్యయనం చేసి రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారంటూ అప్పుడు ఇదే స్థానం నుంచి పనులు ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆనాడు రాజీవ్ సాగర్ దుమ్ముగూడెం ప్రాజెక్టును రూ.1,681 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు నీరందించేలా ప్లాన్ చేశారన్నారు. గోదావరి - శబరి నదులు కలిసే ప్రాంతం రుద్రంకోట వద్ద ఇందిరా సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రూ.1,824 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు నీరందించేలా పనులు ప్రారంభించారని చెప్పారు. రాష్ట్ర విభజనకు ముందే ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి దాదాపు రూ.2,000 కోట్లు ఖర్చు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కేవలం రూ.1,505 కోట్లు ఖర్చు చేస్తే నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చే ఈ ప్రాజెక్టులను కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచనతో రీడిజైనింగ్ చేసిందన్నారు. ఈ కారణంగా సీతమ్మ సాగర్ బ్యారేజ్‌తో కలుపుకుని దాదాపు రూ.24,000 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని, అందులో దాదాపు రూ.7,500 నుంచి రూ.8,000 కోట్లు అదనంగా ఖర్చు పెట్టే పరిస్థితి వచ్చిందని వివరించారు. పీసీసీ అధ్యక్షుడుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్‌గా తాను సభలోనూ, బయటా వివరాలతో ఈ దోపిడీని ఎండగట్టామన్నారు. ఆనాడు రెండు ప్రాజెక్టులను పూర్తి చేయమని చెప్పినా వినకుండా కేసీఆర్ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేబినెట్ మొత్తం కలిసి ఈ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా సమీక్ష చేసి ఇప్పటికే చాలా డబ్బు ఖర్చు పెట్టారు కాబట్టి ప్రాజెక్టును ఆపడం సరికాదని, దీనిని కొనసాగించి పూర్తిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకపోవడం, రిజర్వాయర్ల కెపాసిటీ సమస్యలను సరిదిద్దుతూ, సాగర్ కెనాల్‌తో లింక్ చేస్తూ రాజీవ్ కెనాల్‌ను కలపడం, వైరా రిజర్వాయర్, పాలేరు రిజర్వాయర్‌లను లింక్ కెనాల్స్, టన్నెల్స్ ద్వారా నింపే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. సత్తుపల్లి వరకు నీళ్లు తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పనులను పూర్తి చేసేందుకు నెలవారీ క్యాలెండర్‌ను ఏర్పాటు చేసుకొని సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇది ప్రజల ప్రభుత్వం.. ఏ ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా, జరిగిన పనులను ముందుకు తీసుకు వెళుతూ ప్రాధాన్యతగా తీసుకుని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం స్పష్టంగా ప్రకటించారు. గోదావరి నదిలో చివరన ఉన్న ఈ ప్రాజెక్టు నుండి గరిష్ఠంగా నీటిని తీసుకుని జిల్లా రైతాంగ ఆశలను నెరవేరుస్తామని విస్పష్టంగా ప్రకటించారు.

**ఓట్లు- సీట్లు ఇవ్వలేదని**
**బీఆర్ఎస్ కక్ష: మంత్రి పొంగులేటి**

బీఆర్ఎస్ పార్టీని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎప్పుడూ సరిగా ఆదరించడంలేదనే కక్షతో అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతోపాటు పలు నీటి ప్రాజెక్టులను ఆ పార్టీ నాయకులు గాలికి వదిలేశారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును ఆయన గురువారం సందర్శించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పరిస్థితిని చూస్తే కడుపు తరుక్కుపోతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి ఈ ప్రాంతీయులు ఓట్లు వేసి సీట్లు ఇవ్వనందున గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఉపయుక్తమైన సీతారామ ప్రాజెక్టుకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాజెక్టులకు మహర్దశ పట్టినట్లే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ వాటిని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసినా సీతారామ ప్రాజెక్టుతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టును కూడా సరిదిద్దే తపనతో పనిచేస్తున్నామని, వారు కట్టారని కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయలేమని అన్నారు. గిరిజనులకు ఉపయోగపడే సీతారామ ప్రాజెక్టుల ప్రాధాన్యత గుర్తించి ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని పూర్తిగా అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఉన్న నిధులను బీఆర్ఎస్ పెద్దలు కొల్లగొడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగం కుంటుపడకుండా చర్యలు చేపడుతున్నామని, సీతారామ ప్రాజెక్టుకు గతంలో రూ.115 కోట్లT మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని చెప్పారు. ఇప్పుడు నిధులిస్తూ 1480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు తాగునీటిని కూడా అందిస్తున్నామన్నారు. 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తూ కరవు వచ్చినా కాపాడేలా చేస్తున్నామని, అవసరమైతే అదనంగా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని అబద్ధాలతో కాలంగడుపుతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టం గుర్తించని నాటి పెద్దలు ఇప్పుడు ఈ ప్రభుత్వం ఎలా పని చేస్తున్నదో చూస్తూ జ్ఞానం తెచ్చుకోవాలి అని మంత్రి పొంగులేటి హితవు పలికారు.

# ప్రాణహితకు మళ్లీ ప్రాణం

**భద్రాద్రి కొత్తగూడెం/సత్తుపల్లి, జూలై 16:**

రాష్ట్ర రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చరిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సత్తుపల్లి టన్నెల్ వద్ద సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తమ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు.

**సీతమ్మసాగర్‌కు చట్టబద్ధ**
**మార్గంలో గ్రీన్ సిగ్నల్**

సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు పూర్తి మరింత వేగవంతం కానుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగు భూమికి గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**కాళేశ్వరం పునరుద్ధరణ శాస్త్రీయంగానే**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండానే తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని మంత్రి తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు.

**నీటిపారుదల శాఖకు కొత్త దిశ**

నీటిపారుదల శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, దాదాపు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది నియామకం, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో శాఖకు కొత్త ఊపు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాల కోసం, ప్రజల భద్రత కోసం, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే ప్రతి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు.

## కల్మా చదవాల్సిన అవసరం లేదు

**హైదరాబాద్, జూలై 16 :**

సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థినికి కల్మా, సూరా అల్‌ఫాతిహా నేర్చుకుని రావాలని హోమ్‌వర్క్ ఇవ్వడం అత్యంత అభ్యంతరకర విషయమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. విద్యా సంస్థలు విద్యను బోధించాలే తప్ప ఏ విద్యార్థిపైనా మతపరమైన అంశాలను బలవంతంగా రుద్దే హక్కు లేదన్నారు. మొన్నటికి మొన్న ఆర్మూరులో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా హిందూ పిల్లలకు ఉర్దూ నేర్పిస్తే ఇదేంటని ప్రశ్నించిన ప్రజలపై అక్రమ కేసులు పెట్టారు.. నిన్న అత్తాపూర్‌లో ఆటో వెనక దేవుడి కొటేషన్ రాసుకున్న హిందువును ఒవైసీ మజ్లిస్ పార్టీ నాయకులు బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు.. నేడు సైదాబాద్‌లో హిందూ విద్యార్థులకు కల్మా నేర్పిస్తున్నారు.. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీ ప్రభుత్వం కలిసి హైదరాబాద్‌ను, తెలంగాణను ఏం చేయాలని చూస్తున్నారు అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అన్ని ప్రైవేటు స్కూళ్లలో బోధనపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. ఇలాంటి వ్యవహారాలను చూస్తూ ఉరుకునే ప్రసక్తే లేదని, దీనికి తగినమూల్యం చెల్లించుకోక తప్పదని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## హోంవర్క్‌పై వివాదం.. టీచర్‌ను తొలగించిన పాఠశాల

**హైదరాబాద్, జూలై 16**

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి ఇస్లామిక్ మత బోధనకు సంబంధించిన పాఠాన్ని హోంవర్క్‌గా ఇవ్వడం వివాదానికి దారితీసింది. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించింది. సైదాబాద్‌లోని 'సక్సెస్' ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న రెండో తరగతి విద్యార్థికి 'దీనియాత్' సబ్జెక్టు కింద 'సూరా ఫాతిహా' చదవాలని స్కూల్ డైరీలో హోంవర్క్ రాసినట్లు తెలిసింది. అంతకుముందు జూలై 11న 'కల్మా' చదవాలని రాసి, ఆ విద్యార్థి ముస్లింయేతరుడని గుర్తించిన తర్వాత దానిని కొట్టివేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని కలిసి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాసంస్థలో ఇతర మతాలకు చెందిన విద్యార్థులకు ఇలాంటి మతపరమైన పాఠాలు ఇవ్వడం సమంజసం కాదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పాఠశాల యాజమాన్యం, ఇది ఉపాధ్యాయురాలి పొరపాటు వల్ల జరిగిన ఘటన అని వివరణ ఇచ్చింది. సంబంధిత ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడంతో పాటు, భవిష్యత్తులో తమ విద్యాసంస్థల గ్రూపులో ఉద్యోగానికి అనర్హురాలిగా ప్రకటించినట్లు తెలిపింది. తమ పాఠశాలలో ఎక్కువ మంది ముస్లిం విద్యార్థులు ఉన్నందున వారికి మాత్రమే 'దీనియాత్' సబ్జెక్టు బోధిస్తామని, ఇతర మతాలకు చెందిన విద్యార్థులకు ఆ బోధన ఉండదని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ, హిందూ విద్యార్థికి 'కల్మా' లేదా ఇతర మత బోధనకు సంబంధించిన పాఠాలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

**హైదరాబాద్, జూలై 16**

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫాతిహా చదవాలని సూచించడం దురదృష్టకరమని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజంలోని అన్ని వర్గాలు ఖండించాలని, సెక్యులర్ సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి స్కూల్ డైరీలో కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోంవర్క్ రాసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై వారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు ప్రకటించింది. ఇది పొరపాటున జరిగిన ఘటనేనని, తమ పాఠశాలలో ఇలాంటి సంఘటన ఇదే తొలిసారి అని వివరణ ఇచ్చింది. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకులు పాఠశాలను ముట్టడిస్తామని ప్రకటించడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, స్కూల్‌కు వెళ్లే మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా స్పందించారు. హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న పాఠశాలలు, సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



## సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు

- **డీపీసీ సి.వి.ఆనంద్**

**హైదరాబాద్, జూలై 16:**

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలు, సాంకేతిక సామర్థ్యాల పెంపు లక్ష్యంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపడుతున్న కార్యక్రమాలపై డీజీపీ సి.వి. ఆనంద్ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఓసీ), సెంట్రల్ మానిటరింగ్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, డిజిటల్ ఫోరెన్సిక్ యూనిట్ తదితర విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సాంకేతిక సామర్థ్యాలు, దర్యాప్తు విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తో పాటు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు విధానాలు, కృత్రిమ మేధ వినియోగం, బాధితులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీకి వివరించారు. స్వయంగా ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును డీజీపీ పరిశీలించారు. ‘నేను సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయాను’ అని బాధితురాలు చెప్పగానే ఏఐ వ్యవస్థ వెంటనే స్పందించి ఆమెకు ధైర్యం చెబుతూ పేరు, ప్రాంతం, సమీప పోలీస్ స్టేషన్, సంఘటన వివరాలను సేకరించింది. అదే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరే విధానాన్ని డీజీపీ పరిశీలించి అభినందించారు. ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత సేవలను విస్తరించాలని అధికారులకు సూచించారు. అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025లో రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనప్పటికీ 2024తో పోలిస్తే 20 శాతం తగ్గుదల నమోదైంది. అదేవిధంగా సైబర్ ఫిర్యాదులు 91,369కు పరిమితమవడంతో ఫిర్యాదుల్లో కూడా 3 శాతం తగ్గుదల నమోదైంది. నేరస్తుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే పీఓహెచ్ మొత్తం రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు పెరగగా, పీఓహెచ్ 9 శాతం నుంచి 12 శాతానికి పెరగడం బాధితుల సొమ్ము రక్షణలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనమని అధికారులు వివరించారు. 2025లో దేశవ్యాప్తంగా నమోదైన 49,620 సైబర్ ఎఫ్ఐఆర్‌లలో రాష్ట్రంలో 21,639 ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. అంటే దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం సైబర్ ఎఫ్ఐఆర్‌లలో 44 శాతం తెలంగాణ నుంచే నమోదయ్యాయి. దీంతో సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. అలాగే రూ.75 లక్షలకు పైగా నష్టం కలిగిన కేసుల్లో 78 శాతం, రూ.1 లక్షకు పైగా నష్టం ఉన్న కేసుల్లో 56 శాతం ఎఫ్ఐఆర్ కన్వర్షన్ రేటు నమోదు కావడం రాష్ట్ర పోలీసుల సమర్థవంతమైన చర్యలకు నిదర్శనమని అధికారులు వివరించారు.

2025లో రాష్ట్రంలో నమోదైన 86,177 ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్ లలో 21,639 సైబర్ నేరాలకు సంబంధించినవే. అంటే ప్రతి నాలుగు ప్రధాన నేరాల ఎఫ్ఐఆర్ లలో ఒకటి సైబర్ నేరానిదే. ఇతర ప్రధాన నేరాల వల్ల రూ.207 కోట్ల ఆర్థిక నష్టం జరగగా, సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల నష్టం సంభవించింది. అంటే ఇతర ప్రధాన నేరాల కంటే దాదాపు ఏడు రెట్లు అధిక ఆర్థిక నష్టం సైబర్ నేరాల వల్లే జరుగుతోందని అధికారులు తెలిపారు. సమీక్ష సమావేశం లో డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, తాను డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట సందర్శించిన ప్రత్యేక విభాగాల్లో ఈగిల్ ఒకటని, ఇప్పుడు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర భద్రతలో ఈ రెండు విభాగాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.సైబర్ నేరాలు వేగంగా రూపాంతరం చెందుతున్నందున కొత్త ఆలోచనలు, కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికత, డేటా అనలిటిక్స్ వినియోగిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న జాతీయ పనితీరు సూచికల్లో తెలంగాణ మరింత మెరుగైన స్థానం సాధించే అవకాశం ఉందని, అందుకు సాంకేతిక వ్యవస్థలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక బలగాల పునర్వ్యవస్థీకరణతో పాటు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన ప్రత్యేక విభాగాల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. అవసరమైతే మానవ వనరులను సమర్థంగా వినియోగించి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవలి కాలంలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు, డిజిటల్ ఫైనాన్షియల్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్న డీజీపీ ఇప్పుడే వీటిని సమర్థంగా నియంత్రించకపోతే భవిష్యత్‌లో మరింత తీవ్రమైన సమస్యలు, పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ‘సైబర్ నేరాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి.. జీవితాంతం కూడబెట్టుకున్న పొదుపులను ఒక్క క్షణంలో కోల్పోతున్నారు.. భవిష్యత్‌లో నేరాల స్వరూపం ప్రధానంగా సైబర్ నేరాల చుట్టూనే తిరుగుతుంది.. అందువల్ల ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి’ అని డీజీపీ సూచించారు. తెలంగాణను సాంకేతికత ఆధారిత సైబర్ పోలీసింగ్‌లో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని, వేగవంతమైన స్పందన, ప్రజల్లో విస్తృత అవగాహన, సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా సైబర్ నేరాల నియంత్రణలో అగ్రస్థానాన్ని నిలబెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# విద్యుత్ వెలుగుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

**మొదటిపేజీ తరువాయి**

కల్పనపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో యుద్ధప్రాతిపదికన అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. కేవలం గత ఆరు నెలల్లోనే 9,800 అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యం కల్పించడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 32,109 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అంటే దాదాపు 90 శాతం అంగన్‌వాడీ కేంద్రాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. మిగిలిన కేంద్రాలకు సైతం త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం విద్యుదీకరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు వేగవంతం చేసింది. గతంలో దాదాపు 40 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యమే లేకపోవడంతో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీకటి గదులు, ఉక్కపోత వాతావరణంలో చిన్నారులు కేంద్రాలకు రావాలంటేనే భయపడే పరిస్థితులు ఉండేవి. ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో వేసవిలో పిల్లలను కేంద్రాల్లో ఉంచడం అంగన్‌వాడీ కార్యకర్తలకు సవాల్‌గా మారేది. డిజిటల్ బోధనకు సైతం విద్యుత్ లేమి ప్రధాన అడ్డంకిగా నిలిచింది. ఈ పరిస్థితిని గుర్తించిన మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న విధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన అంశం కావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. విద్యుత్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ కొత్త కనెక్షన్ల ప్రక్రియను వేగవంతం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ కనెక్షన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఫలితంగా 11,194 కేంద్రాలకు నూతనంగా విద్యుత్ సదుపాయం కల్పించారు. ‘బలమైన భవిష్యత్‌కు బాల్యమే పునాది.. చిన్నారులు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో ఎదగాలి.. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత.. త్వరలోనే మిగిలిన కేంద్రాలకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం లక్ష్యాన్ని సాధిస్తాం’ అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బంగారు తెలంగాణ అంటూ గొప్పలు చెప్పుకుందని, కానీ భవిష్యత్ తరాలకు పునాది వేసే వేలాది అంగన్‌వాడీ కేంద్రాలకు కనీస విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేకపోయిందని ఆరోపించారు. ప్రచారంలో వెలుగులు చూపించారు తప్ప.. అంగన్‌వాడీల్లో చీకట్లు తొలగించలేదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మాటలతో కాదు.. చేతలతో చిన్నారుల కేంద్రాల్లో వెలుగులు నింపుతోంది అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# డీలిమిటేషన్ చుట్టూ రాజకీయ చదరంగం!

## పార్లమెంట్ సమావేశాల వేళ వేగం పెంచిన ఎన్డీఏ వ్యూహాలు

## రెండింట మూడొంతుల మెజారిటీపై బీజేపీ దృష్టి

మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శతృవులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# రూ.5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం

- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 16 :** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ దర్యాప్తు మరిన్ని కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రానికి చెందిన 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించినట్లు సీబీఐ ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. కేసులో నిందితుడైన మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా పనిచేసిన పీవీ కులకర్ణి ద్వారా శివరాజ్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. శివరాజ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా 36 ఫొటోలు లభించాయని, వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉన్నాయని సీబీఐ వెల్లడించింది. వీటిలో 111 ప్రశ్నలు నీట్-యూజీ 2026 మాస్టర్ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు తెలిపింది. ఆ ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ కూడా నిందితుడివేనని భావిస్తున్నట్లు కోర్టుకు వివరించింది. పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు, అంటే ఏప్రిల్ 23 ప్రాంతంలోనే ఈ ప్రశ్నలు నిందితుడి వద్దకు చేరినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ పేర్కొంది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపించింది. అంతేకాకుండా లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల అంచనా ప్రశ్నపత్రాన్ని కొంతమంది అభ్యర్థులకు అందించగా, అందులోని సుమారు 120 ప్రశ్నలు అసలు నీట్ రసాయన శాస్త్ర ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ తెలిపింది. వారంతా ప్రస్తుతం న్యాయస్థాన కస్టడీలో ఉన్నారని పేర్కొంది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేయగా, అనంతరం జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రశ్నపత్రం లీక్ నెట్‌వర్క్, ఇతర ప్రమేయంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన



- అతడిని కాపాడాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 16 :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకుపైగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు. తాజాగా తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ఒక వీడియో విడుదల చేశారు. నా ఆరోగ్యం క్షీణించిన మాట వాస్తవమే. కానీ అత్యంత ప్రమాదకర స్థితికేం దిగజారలేదు. నిరాహార దీక్ష విరమించాలని నన్ను అడగడానికి బదులు జులై 20న 'చలో సంసద్' పేరిట పార్లమెంట్ వరకు నిర్వహించే శాంతియుత మార్చ్‌లో భాగం కావాలని మద్దతుదారులను ఆయన కోరారు.

# పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

## నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రత్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్స్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

## బోర్డు పరీక్షలకు పునాది వేసే సమయంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జూలై 16:** 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

# పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు

- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

**న్యూఢిల్లీ, జూలై 16 :** ఈ నెల 20 నుంచి ప్రారంభమై ఆగస్టు 17 వరకు కొనసాగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పార్లమెంట్‌లో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను కాపాడే లక్ష్యంతో ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ నిఘా పరికరాలను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. సభా కార్యకలాపాలను అనధికారికంగా చిత్రీకరించడం, వీడియోలు రికార్డు చేయడం లేదా రహస్యంగా సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయం తెలిపింది. డిజిటల్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో పార్లమెంట్‌లోకి ప్రవేశించే ప్రతి సభ్యుడు, అధికారి, సిబ్బంది ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. భద్రతా చర్యలతో పాటు పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు నిర్వహించడంపై కూడా పూర్తి నిషేధం విధించారు. ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం, సభా మర్యాదలకు భంగం కలిగించే చర్యలకు అనుమతి ఉండదని బులిటెన్‌లో పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు, పూజలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సభా గౌరవం, క్రమశిక్షణ, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఎంపీలందరూ కొత్త మార్గదర్శకాలను పాటించాలని లోక్‌సభ సచివాలయం విజ్ఞప్తి చేసింది.



# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నివారణ, విద్య, వాతావరణ పరిస్థితులు, ప్రజాపాలన అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగం సంబంధించి ఎల్ నీ నో ఎఫెక్ట్ ఉన్నందున రైతులు సంప్రదాయ వరి పంట వైపు కాకుండా ఇతర ఆరుతడి వంటల వైపు మొగ్గు చూపాలని దీనితో కొంతవరకు నష్టాన్ని పోసుకోవడానికి అవకాశం ఉంటుంది అదేవిధంగా కూరగాయలు ఇతర స్వల్పకాలిక ఆరుతడి పంటల వైపు వ్యవసాయదారులు ఆలోచించాల్సిన అవసరం ఉందని ఎల్నినోగా జిల్లా వ్యవసాయ అధికారి ప్రణాళిక రూపొందించి జిల్లాలో వరి స్థానంలో ఇతర పంటను ప్రోత్సహించడానికి తగు ప్రణాళిక రూపొందించి వాటిని ప్రజల్లోకివ్యవసాయదారులకు తీసుకెళ్లి ఆరుతడి పంటల కోసం ప్రోత్సహించాల్సిందిగా ఆదేశించారు జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, స్థానిక సంస్థలశాఖలుసమన్వయంతో పనిచేయాలని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల హాజరు, బోధన, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భారీ వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజాపాలన కార్యక్రమాల అమలులో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బెల్లం చలపతిరావు దిశ దినకర్మలో ఘన నివాళులు అర్పించిన

- సిపిఐఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు,భాగం హేమంతరావు,
- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ సీనియర్ నాయకులు,పోటు పుల్లయ్య
- కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ చావా శివరామకృష్ణ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ బెల్లం రాము తండ్రి అయిన బెల్లం చలపతిరావు దిశ దినకర్మలో గురువారం ముఖ్య అతిథులుగా హాజరైన, సీపీఐఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఎర్రగడ్డ గ్రామంలో గత కొన్ని రోజులుగా, అనారోగ్య కారణాలతో మృతి చెందిన బెల్లం చలపతిరావు చిత్రపటానికి పూలమాలవేసి వారి దిశ దినకర్మలో గురువారం, ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం,ఎర్రగడ్డ గ్రామంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి,తెలిపి,వారికి ఓదార్చారు,ఈ కార్యక్రమం లో, సిపిఐఎం జిల్లా కార్యదర్శి, నున్నా నాగేశ్వరరావు,నున్నా అనుమతి సిపిఐఎం,మండల కార్యదర్శి కొమ్ము శ్రీను,మండల సిపిఐ కార్యదర్శి,బత్తుల రాధాకృష్ణ, బిక్కసాని గంగాధర్ రావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ నాయకులు,పోటు పుల్లయ్య, సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు, భాగం హేమంతరావు, తిరుమలాయపాలెం, మండల డిసిసిబి,చైర్మన్ చావా వేణుగోపాలకృష్ణ, బెల్లం చలపతిరావు కుమార్తె అల్లుడు తాళ్లూరి మురళీధర్ బెల్లం ఇందుమతి కుమారుడు,బెల్లం రమేష్ ,పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ మాజీ ఎంపీపీ,బోడా మంగీలాల్ నాయక్ మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లమల్ల ప్రతాప్ బత్తుల రవికుమార్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ గౌడ్ కొక్కిరేణి గ్రామ మాజీ ఎంపీటీసీ గుగ్గిల అంబేద్కర్ సిరి గద్దె ఉపేందర్ తాటికొండ కిరణ్ వెన్నం సుధాకర్ రెడ్డి షేక్ సైఫుద్దీన్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్ కొంగు నరసింహారావు తిమ్మిడి వెంకట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# తల్లికి రక్తదానం చేసిన కొడుకులు




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** తొమ్మిది నెలలు తన రక్తాన్ని పంచి ప్రాణం పోసిన తల్లికి తన రక్తాన్ని దానం చేసి ఆమె ప్రాణాన్నికాపాడిన కొడుకులు తల్లి చేసిన త్యాగానికి ప్రతిఫలంఇవ్వడంఅసాధ్యంకానీ ఆమెకు అవసరమైన సమయంలో అండగా నిలిచి రక్తదానం చేయడం కుమారుల గొప్ప మనసుకు నిదర్శనంతల్లి ప్రేమను వెలకట్టలేంతల్లిని కాపాడటం కంటేగొప్పపుణ్యంలేదు.అటువంటి పుణ్యం సొంతంచేసుకున్నారు మన కామారెడ్డి యువకులు ముదాంఅనిల్(కానిస్టేబుల్ ),అఖిల్,లక్కాకుల మనోజ్, హైదరాబాద్ లోనీ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కామారెడ్డి జిల్లా మర్కల్ గ్రామానికి గోదావరి అనే పేషంటికి అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తమై ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు వారి బంధువులు కామారెడ్డి జిల్లా రక్తదాతల సేవా సమితి భువనగిరి శివకుమార్ నిర్వాహకులనీ సంప్రదించగా పేషంట్ కీ నిన్న హైదరాబాద్ లో తన స్నేహితులతో ముగ్గురుని వారి కొడుకులు ముగ్గురుతో రక్తం ఇప్పించి ఆమె ప్రాణాలను కాపాడగలిగారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ ఎవరికైనా రక్తం అవసరం ఉంటే9666620006,9848687025నంబర్లను సంప్రదించగలరని కోరారు. రక్తదాతలకు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేషంట్ కుటుంబసభ్యులు బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలి

- తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి బోధించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధన విధానాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇతర భాషల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు బోధన సవాలుగా మారిందని, దానిని అధిగమించేందుకు సృజనాత్మక బోధన పద్ధతులను అవలంభించాలని అన్నారు. కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియల ద్వారా విద్యార్థుల భాషా నైపుణ్యాలను పెంపొందించవచ్చని, శిక్షణలో పొందిన అనుభవాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్రం ఇన్చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డీఆర్పీలు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న కెరీర్ గైడెన్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ :** జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల ఎస్ పి ఎం లో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ఒక్క రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. 3 సెషన్స్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి కమర్షియల్ టాక్స్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ అనురాధ, 4 మంది సభ్యులు హాజరై విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ అనంతరం తీసుకోవలసిన కోర్సులు, ఎంచుకోవలసిన ఉన్నత విద్య అవకాశాలపై క్షుణ్ణంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఏఐటీయూసీ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ(బోథ్):** ఈనెల 19న ఆదిలాబాద్లో జరగనున్న ఏఐటీయూసీ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవర్ధన్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణే ఏఐటీయూసీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, సామాజిక భద్రత కల్పించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభలో విస్తృతంగా చర్చిస్తామని తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించి, పోరాట ప్రణాళికను సిద్ధం చేస్తామని వివరించారు. జిల్లాలోని అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, బీడీ కార్మికులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కలెక్టర్ కు విన్నపం



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** గతంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచుల ప్రతినిధి బృందం గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ గత పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం చేపట్టిన భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చాలా కాలంగా పెండింగ్లో ఉండటంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. పనులు పూర్తి చేసేందుకు చేసిన అప్పులను తీర్చలేక, అప్పు ఇచ్చిన వారి ఒత్తిళ్లతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ పెండింగ్ బిల్లుల అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మహేందర్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ సర్పంచులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్



**రాజముద్ర న్యూస్, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంతో పాటు దుబ్బగూడా, భీంజిగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకల్లో వచ్చే పీపీఆర్ అంటువ్యాధి నివారణ కోసం గురువారం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ సురేష్, వెటర్నరీ అసిస్టెంట్ ఆర్.సికిందర్, దుబ్బగూడా సర్పంచ్ భీంరావ్ పాల్గొని గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ప్రాణాంతకంగా మారే పీపీఆర్ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ప్రతి పశుపోషక రైతు తమ పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వ్యాక్సినేషన్ ద్వారా పశువులు అంటువ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందడంతో పాటు రైతులకు కలిగే ఆర్థిక నష్టాలను కూడా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పశుపోషక రైతులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్లో ఏసీబీ పంజా

- లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఇరిగేషన్ శాఖాధికారులు



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఏసీబీ అధికారులు మరోమారు తమదైన శైలిలో పంజా విసిరారు. ఆదిలాబాద్లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో జరిగిన ఈ దాడి, జిల్లా అధికార యంత్రాంగంలో కలకలం రేపింది. ఎన్ఓసీ కోసం లంచం డిమాండ్ చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సౌనాల గ్రామానికి చెందిన చౌహన్ విక్రమ్ సింగ్ తన వ్యవసాయ క్షేత్రంలో విమల పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' కోసం ఆయన కార్యాలయానికి వెళ్లారు. అయితే ఈ ఫైల్ క్లియర్ చేయాలంటే తమకు భారీగా లంచం ఇవ్వాల్సిందేనని సంబంధిత అధికారులు డిమాండ్ చేశారు. బాధితుడు ఎంతో ప్రాధేయపడినా అధికారులు వినిపించుకోకుండా, రూ.60వేల లంచంగా డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని విక్రమ్ సింగ్, వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పతకం ప్రకారం రంగంలోకి దిగారు. గురువారం చౌహన్ విక్రమ్ సింగ్ నుంచి ఆఫీసులో రూ.60వేల నగదు తీసుకుంటుండగా, ఇరిగేషన్ శాఖ ఈఈ రాథోడ్ విఠల్, ఏఈ రమేష్ లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుల నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రభుత్వ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్యుల నుంచి, క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు ఇలా లంచం డిమాండ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాసేవ కోసం నియమితులైన అధికారులే స్వయంగా లంచం తీసుకుంటూ పట్టుబడటం, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏసీబీ అధికారుల ఈ మెరుపు దాడితో అవినీతికి పాల్పడే ఇతర అధికారుల్లో ఒక్కసారిగా వణుకు మొదలైంది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు మేలు





- జిల్లా వ్యవసాయ అధికారి బోర్కొటె వెంకటి

**రాజముద్ర న్యూస్, కౌటాల:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి బోర్కొటె వెంకటి సూచించారు. గురువారం కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువుల డీలర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కంది, జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, నువ్వులు, ఆముదం వంటి ఆరుతడి, మెట్ట పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాభావం కారణంగా చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదని, అలాంటి పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. వరి పొలాల్లో అధిక సాంద్రత విధానం ద్వారా పత్తి సాగు చేపట్టవచ్చని, అలాగే ఈ నెలాఖరు వరకు కంది విత్తనాలను విత్తుకోవచ్చని అన్నారు. పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా 200 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి ఆకులపై పిచికారీ చేయాలని, అలాగే 19:19:19 నీటిలో కరిగే ఎరువును కూడా పిచికారీ చేయడం ద్వారా పంట ఎదుగుదల మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు సీహెచ్ అంజన్న, జి.ఘన్శ్యామ్, రాజేశ్వర్, ఎస్.సాగర్, ఎస్.కల్పన, ఆర్.రేష్మిత, జి.కవిత, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తా

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్
- సిర్పూర్లో తొలిసారిగా మున్నూరు కాపు మహిళా కమిటీ ఏర్పాటు



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో తొలిసారిగా మున్నూరు కాపు సంఘం మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. కాగజ్నగర్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో తాలూకా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఎమ్మాజీ శారద, కార్యదర్శిగా కర్ల లావణ్య చిరంజీవి, ఉపాధ్యక్షురాలిగా పెద్దపల్లి అనిత శ్రీనివాస్, మండల అధ్యక్షురాలిగా గజ్జి కవిత కోటేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులను తాలూకా అధ్యక్షుడు, కార్యదర్శి, సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ నూతన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో తొలిసారిగా మున్నూరుకాపు సంఘం మహిళా కమిటీ ఏర్పడటం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. మహిళలు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మున్నూరు కాపు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘం నియోజకవర్గంలో బలమైన సామాజిక శక్తిగా ఎదుగుతోందని అన్నారు. సంఘ అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం తాలూకా అధ్యక్షుడు సుంకరి తిరుపతి, కార్యదర్శి గోలెం వెంకటేశం, తాటి రామచందర్, పోతురాజుల లక్ష్మణ్, కలికోట రమణయ్య, ఏస సత్యనారాయణ, ఎమ్మాజీ సంతోష్, బర్ల కిరణ్ కుమార్, కర్ల చిరంజీవి, నాగేశ్వరరావు, బల్దారుపు రాజన్న, సిద్ధం శ్రీనివాస్, జవాజి సంతోష్, గజ్జి మహేష్, ఎమ్మాజీ మహేష్, ఒడ్నాల సురేందర్, పూదరి మధుకర్, గడ్డల తిరుపతి, మేడిపల్లి రవి, గోవిందుల రాజన్న, సత్యంశెట్టి శ్రీనివాస్, పర్వతి సాయికుమార్, మహిళా సభ్యులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి క్షేత్రస్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కమిషన్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు అధికారులు కమిషన్ చైర్మన్, సభ్యులకు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు, అట్రాసిటీ కేసుల దర్యాప్తు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలు, సబ్ప్లాన్ నిధుల వినియోగం తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసుల నమోదు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధిహామీ పథకం అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లోని ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులు, రోస్టర్ విధానాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా అమలు చేయాలని, ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే సమావేశాలను నిర్వహించి ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధించిన నిధులు ఎక్కడైనా పెండింగ్లో ఉంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కామన్ మెనూ అమలు, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రయోజనాలు అందిస్తున్నామని, అట్రాసిటీ కేసుల దర్యాప్తు కూడా వేగంగా కొనసాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీఓ మంద మకరందు, ఏఎస్పీ సాయి రుత్విక్ కొట్టే, అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రూ, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు జగదీశ్వర్ రావు, మోహన్ సింగ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# వర్షా భావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**రాజముద్ర న్యూస్, తాండూర్:** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తాండూర్ ఏఈఓ వెంకటేష్ సూచించారు. గురువారం మాదారం గ్రామ శివారులో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో మినుములు, పెసర, కంది, జొన్న, రాగులు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు దిగుబడిని కాపాడుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు. పంట వైవిధ్యంతో భూసారం కూడా పరిరక్షించబడుతుందని వివరించారు. అదేవిధంగా కిష్టంపేట గ్రామంలో ఏఈఓ రాకేష్ రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో సాంప్రదాయ పంటలకు బదులుగా కంది, పెసర, మినుము, నువ్వులు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట వైవిధ్యాన్ని పాటించడం ద్వారా వాతావరణ మార్పులతో కలిగే నష్టాలను అధిగమించవచ్చని రైతులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మాదారం, కిష్టంపేట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# పోడు వ్యవసాయం కేసులో ఇద్దరి రిమాండ్




**రాజముద్ర న్యూస్, బెజ్జూర్:** పోడు వ్యవసాయం చేసిన ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించిన ఘటన బెజ్జూర్ మండలంలో చోటుచేసుకుంది. ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన మండిగ చిన్నయ్య, మండిగ లక్ష్మణ్ అటవీ భూమిలో అనుమతులు లేకుండా పోడు వ్యవసాయం చేస్తున్నట్లు అటవీ సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే కుంటల మానేపల్లి ఎఫ్ఎస్ఓ జె.సంతోష్ కుమార్, ఎఫ్బీఓ వి.శ్రీవాణి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూమిలో పోడు వ్యవసాయం సాగు చేస్తున్నట్లు నిర్ధారించడంతో ఇద్దరిపై అటవీ చట్టాల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా పోడు వ్యవసాయం చేపట్టడం చట్టవిరుద్ధమని, అటవీ సంపదను పరిరక్షించేందుకు ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. అటవీ భూములను ఆక్రమించి సాగు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సమన్వయంతో, క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రానున్న కార్యక్రమాల నిర్వహణలో నాయకులు సమిష్టిగా పనిచేసి పార్టీ ప్రతిష్ఠను మరింత పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# టీమిండియా యువ పేసర్‌కు బిగ్‌షాక్



## భారీ జరిమానా విధించిన ఐసీసీ

**బర్మింగ్‌హామ్, జూలై 16 :** టీమ్‌ఇండియా యువ పేసర్ గుర్నార్ బ్రార్ ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ జరిమానాకు గురయ్యాడు. బర్మింగ్‌హామ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో గుర్నార్ బ్రార్ ప్రమాదకర రీతిలో బౌలింగ్ చేశాడనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), అతడి ప్రవర్తన సరిగ్గా లేదని నిర్ధారించింది. ఐసీసీ నిబంధనావళిలోని లెవెల్-1 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ గుర్నార్ మ్యాచ్ ఫీజులో కొంత శాతాన్ని జరిమానాగా విధించడంతో పాటు, అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. మ్యాచ్ ఆఖరి ఓవర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న సమయంలో గుర్నార్ బ్రార్ వేసిన ఒక డెలివరీ ఇంగ్లాండ్ బ్యాటర్‌కు ప్రమాదకరంగా దూసుకెళ్లింది. బ్యాటర్ రక్షణను ప్రమాదంలో పడేసేలా, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఆ బంతిని సంధించినట్లు ఫీల్డ్ అంపైర్లు గుర్తించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత అంపైర్లు ఈ విషయాన్ని మ్యాచ్ రెఫరీ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9 ప్రకారం.. వికెట్ల మధ్య పరిగెడుతున్న లేదా క్రీజులో ఉన్న ఆటగాళ్లపైకి ప్రమాదకరంగా బంతిని విసరడం లేదా దూకుడుగా ప్రవర్తించడం నేరం కిందకు వస్తుంది. గుర్నార్ తన తప్పును అంగీకరించడంతో ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే మ్యాచ్ రెఫరీ ఈ శిక్షను ఖరారు చేశారు. ఒక ఏడాది కాలంలో ఆటగాళ్లకు వచ్చే డీమెరిట్ పాయింట్లు వారి భవిష్యత్తు మ్యాచ్‌లపై ప్రభావం చూపుతాయి. 24 నెలల వ్యవధిలో ఒక ఆటగాడు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు సాధిస్తే, వారు నిషేధాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. గుర్నార్ బ్రార్ లాంటి యువ ఆటగాళ్లకు ఇటువంటి క్రమశిక్షణా చర్యలు కెరీర్ ఆరంభంలోనే ఒక హెచ్చరికగా మారుతాయి. మైదానంలో దూకుడు ప్రదర్శించడం మంచిదే అయినప్పటికీ, అది ఐసీసీ నిర్దేశించిన హద్దులను దాటకూడదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత జట్టు మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తు మ్యాచ్‌లలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భావోద్వేగాలను నియంత్రించుకుంటూ బౌలింగ్ చేయాలని గుర్నార్‌కు సూచించింది. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న టీమ్‌ఇండియాకు ఈ పరిణామం కాస్త ఇబ్బందికరంగా మారినప్పటికీ, తదుపరి మ్యాచ్‌ల్లో గుర్నార్ బ్రార్ పుంజుకుంటాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# 2027 ప్రపంచకప్‌కు కొత్త ఫార్మాట్

## భారత్-పాక్‌కు మూడుసార్లు తలపడే అవకాశం



**దుబాయ్, జూలై 16 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులకు ఆమోదం తెలిపింది. కొత్త విధానంతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా సాగడంతో పాటు, చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే ప్రపంచకప్‌లో గరిష్ఠంగా మూడుసార్లు తలపడే అవకాశాన్ని కల్పించింది. ఈ మార్పులు పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా వాణిజ్యపరంగానూ టోర్నీకి మరింత ఆకర్షణ తీసుకురానున్నాయని ఐసీసీ భావిస్తోంది. 2027 ప్రపంచకప్‌కు మొత్తం 14 జట్లు అర్హత సాధించినప్పటికీ, ప్రధాన టోర్నీని 12 జట్లతో నిర్వహించనున్నారు. దిగువ స్థానాల్లో నిలిచిన మూడు జట్ల మధ్య ముందుగా ప్రిలిమినరీ దశ నిర్వహించి, అందులో విజేతగా నిలిచిన జట్టుకు ప్రధాన టోర్నీలో చోటు కల్పిస్తారు. అనంతరం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. లీగ్ దశ అనంతరం ఇప్పటి వరకు అమల్లో ఉన్న 'సూపర్ సిక్స్' విధానానికి బదులుగా 'సూపర్ సెవెన్' దశను ప్రవేశపెట్టారు. రెండు గ్రూపుల నుంచి అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఏడు జట్లు ఈ దశకు అర్హత సాధిస్తాయి. ఇక్కడ జట్లు పరస్పరం రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. ఈ దశ ముగిసిన తర్వాత క్వార్టర్ ఫైనల్స్ లేకుండానే నేరుగా సెమీ ఫైనల్స్, అనంతరం ఫైనల్ నిర్వహించనున్నారు. కొత్త ఫార్మాట్‌తో భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే టోర్నీలో మూడు సార్లు తలపడే అవకాశాలు పెరిగాయి. గ్రూప్ దశలో ఒకసారి, సూపర్ సెవెన్‌లో మరోసారి, అనంతరం సెమీ ఫైనల్ లేదా ఫైనల్‌లో మరోసారి ఈ రెండు జట్లు ఎదురుపడే అవకాశం ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఐసీసీ టోర్నీల్లోనే ఈ రెండు దేశాలు తలపడుతున్న నేపథ్యంలో ఈ మార్పు అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్--పాకిస్థాన్ మ్యాచ్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ దృష్ట్యా ప్రసార హక్కులు, ప్రకటనల ఆదాయం కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమావేశంలో 2028 టీ20 ప్రపంచకప్ ఫార్మాట్‌లోనూ ఐసీసీ మార్పులకు ఆమోదం తెలిపింది. ఈ టోర్నీ 20 జట్లతోనే కొనసాగనున్నప్పటికీ, గ్రూప్ దశ అనంతరం ఎనిమిది జట్లకు బదులుగా పది జట్లు 'సూపర్ 10' దశకు అర్హత సాధిస్తాయి. అక్కడ అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు నేరుగా సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా, మిగిలిన రెండు సెమీ ఫైనల్ బెర్తుల కోసం కొత్తగా 'ఎలిమినేటర్' దశను నిర్వహించనున్నారు. ఈ మార్పులతో రెండు ప్రపంచకప్‌లూ మరింత పోటీతత్వంతో సాగనున్నాయని ఐసీసీ పేర్కొంది.




# రోహిత్ శర్మపై వేటు

## జట్టులోకి యువరాజ్ సింగ్, సచిన్

**ఢిల్లీ, జూలై 16 :** మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ రాబిన్ ఉతప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'దిస్ ఆర్ దట్' ఛాలెంజ్ ద్వారా తన భారత వన్డే ఎలెవెన్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో రోహిత్ శర్మ, హర్భజన్ సింగ్ వంటి దిగ్గజాలకు చోటు దక్కకపోవడం గమనార్హం. రోహిత్ శర్మ, సునీల్ గవాస్కర్‌లను పక్కనపెట్టి సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీలను ఓపెనర్లుగా ఉతప్ప ఎంచుకున్నారు. మిడిలార్డర్‌లో 2011 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులైన విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని, సురేష్ రైనాలకు అవకాశం ఇచ్చారు. రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, అజయ్ జడేజాల కంటే వీరికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఛాలెంజ్‌లో ధోనిని మరెవరితోనూ పోల్చకుండా నేరుగా ఎంపిక చేయడం విశేషం. భారత 1983 ప్రపంచకప్ కెప్టెన్ కపిల్ దేవ్, రవీంద్ర జడేజాలను ఆల్‌రౌండర్లుగా ఎంపిక చేశారు. హార్దిక్ పాండ్యా, రవిచంద్రన్ అశ్విన్‌లకు ఇందులో చోటు దక్కలేదు. ఇక స్పిన్ విభాగంలో వన్డేల్లో భారతదేశం తరఫున అత్యధిక వికెట్లు (334) తీసిన అనిల్ కుంబ్లేకు మొగ్గు చూపారు. హర్భజన్ సింగ్‌ను (265 వికెట్లు) పక్కన పెట్టారు. ఫాస్ట్ బౌలర్లుగా జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రాలను ఎంచుకున్నారు. ఈ జట్టులో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లు ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా. వన్డేల్లో 54 శతకాలతో అత్యధిక సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా ఉన్న విరాట్ కోహ్లీ (14,802 పరుగులు), సచిన్ టెండూల్కర్ (18,426 పరుగులు) తర్వాత భారత్ తరఫున రెండో అత్యధిక రన్-స్కోరర్‌గా ఉన్నారు.

### రాబిన్ ఉతప్ప వన్డే జట్టు

సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని (కెప్టెన్), సురేష్ రైనా, కపిల్ దేవ్, రవీంద్ర జడేజా, అనిల్ కుంబ్లే, జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రా.

# కోహ్లీ విజయానికి ఆత్మవిశ్వాసమే బలమన్న అభిషేక్ నాయర్

**ముంబై, జూలై 16 :** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విజయాల వెనుక ఉన్న ప్రధాన రహస్యం తన ఆటతీరుపై అతడికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ సహాయక కోచ్ అభిషేక్ నాయర్ వెల్లడించాడు. కఠిన పరిస్థితుల్లో కూడా తన పద్ధతులను మార్చకుండా ముందుకు సాగే కోహ్లీ మానసిక ధైర్యమే అతడిని ప్రపంచంలోని అత్యుత్తమ క్రికెటర్లలో ఒకరిగా నిలబెట్టిందని ప్రశంసించాడు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా కోహ్లీతో జరిగిన ఆసక్తికర సంభాషణను నాయర్ గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతడిపై విమర్శలు వెల్లువెత్తిన సమయంలో కూడా కోహ్లీ ఏమాత్రం ఆందోళన చెందలేదని నాయర్ తెలిపాడు. ఆ సమయంలో తాను కోహ్లీకి ఫోన్ చేసి పరిస్థితి గురించి మాట్లాడగా, "అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే" అని ఎంతో ప్రశాంతంగా సమాధానం ఇచ్చాడని వెల్లడించాడు. ఆ సమాధానం కోహ్లీ మానసిక స్థైర్యానికి నిదర్శనమని పేర్కొన్నాడు. తాను గమనించిన ఒక సాంకేతిక అంశంపై సూచన ఇవ్వాలని కోహ్లీని అడిగినప్పుడు, "నేను నా పద్ధతిలోనే కొనసాగుతాను" అని సున్నితంగా తిరస్కరించాడని నాయర్ చెప్పాడు. ఆ తర్వాత జరిగిన మ్యాచ్ అనంతరం కూడా కోహ్లీ తన ఆటతీరుపై నమ్మకం ఉంచి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, తన నిర్ణయంపై కోహ్లీకి ఉన్న విశ్వాసం తనను ఎంతో ఆకట్టుకుందని వివరించాడు. ఈ ఒక్క సంఘటన గొప్ప ఆటగాళ్ల మానసిక బలాన్ని స్పష్టంగా చూపిస్తుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా స్పందించాలో, ఎలా తిరిగి ఫామ్‌లోకి రావాలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లకు బాగా తెలుసని అన్నాడు. విశ్లేషకులు ఎన్నో సూచనలు చేసినా, అంతర్జాతీయ స్థాయిలో నిరంతరం విజయాలు సాధించేది ఆటగాళ్ల ఆత్మవిశ్వాసమేనని పేర్కొన్నాడు. అందుకే కోహ్లీ, రోహిత్‌లాంటి క్రికెటర్లపై తనకు అపారమైన గౌరవం ఉందని, తమపై తాము పెట్టుకున్న నమ్మకమే వారిని ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెట్టిందని అభిషేక్ నాయర్ వెల్లడించాడు.



# అర్జెంటీనా ఆటగాళ్ల బ్యానర్‌పై వివాదం

**అట్లాంటా, జూలై 16 :** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇంగ్లండ్‌పై సెమీఫైనల్ విజయం అనంతరం అర్జెంటీనా ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ వివాదానికి దారి తీసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో సంబరాలు జరుపుకున్న ఆటగాళ్లు ఫాక్‌ల్యాండ్స్ దీవులకు సంబంధించిన సందేశంతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శించారు. అందులో 'లాస్ మాల్వినాస్ అర్జెంటీనావే' అనే భావం వ్యక్తమయ్యే నినాదం ఉండటంతో రాజకీయ వివాదం చెలరేగింది. ఫాక్‌ల్యాండ్స్ దీవులపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న ఈ దీవులు ప్రస్తుతం బ్రిటన్ ఆధీనంలో ఉన్నప్పటికీ, అవి తమ భూభాగమేనని అర్జెంటీనా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ క్రీడా వేదికపై రాజకీయ సంకేతాలను ప్రోత్సహించినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. 1982లో ఫాక్‌ల్యాండ్స్ దీవుల అంశంపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య యుద్ధం జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో 2014లో కూడా అర్జెంటీనా ఆటగాళ్లు ఇలాంటి వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించగా, అప్పట్లో జట్టుపై భారీ జరిమానా విధించారు. తాజా ఘటనపై ఫిఫా అధికారులు దర్యాప్తు ప్రారంభించనున్నట్లు సమాచారం. పోటీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ సందేశాలను ప్రదర్శించారనే ఆరోపణలపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకునే అవకాశముందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.



# ప్రేక్షకుల ప్రేమే నా బలం: కిరణ్ అబ్బవరం



**హైదరాబాద్, జూలై 16 :** గత ఐదారు సంవత్సరాలుగా ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రేమాభిమానాలు అందుకున్నానని, మంచి చిత్రాలతో వారి ఆదరణను మరింతగా పొందేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న లిచెన్నై ప్రేమకథ' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చిత్రంలో స్వచ్ఛమైన ప్రేమకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఒక యువతి కోసం ఎంత గొప్పగా ప్రేమించవచ్చో ఈ కథలో చూపించామని, ప్రేమతో పాటు ప్రేక్షకులను అలరించే మాస్ అంశాలు కూడా చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. నిర్మాత ఎస్.కే.ఎన్. మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను తాకే ప్రేమకథగా నిలుస్తుందని చెప్పారు. దర్శకుడు రవి నంబూరి మాట్లాడుతూ, ప్రధాన పాత్రల భావోద్వేగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ చిత్రంలో శ్రీగౌరి ప్రియ కథానాయికగా నటించగా, సంగీతాన్ని మణిశర్మ సమకూర్చారు.


# 'ఆపరేషన్ అరుణారెడ్డి'పై పోసాని ధీమా



**హైదరాబాద్, జూలై 16 :** పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణం, దర్శకత్వంలో తెరకెక్కించిన 'ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విడుదలకు ముందరి కార్యక్రమంలో పోసాని మాట్లాడుతూ ఈ చిత్రం తన సినీ జీవితంలో అత్యుత్తమ కథనంతో రూపొందిన చిత్రమని అన్నారు. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు కథ ఏ మలుపు తిరుగుతుందో ప్రేక్షకులు ఊహించలేరని, ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా సాగుతుందని తెలిపారు. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా చిత్రాన్ని తెరకెక్కించామని చెప్పారు. ఈ చిత్రంలో హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, అయేషా ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషించగా, మహదేవ్ ఏలెందర్ సంగీతం సమకూర్చారు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.





# రజనీకాంత్ చిత్రంలో రుక్మిణికి ఛాన్స్



**చెన్నై, జూలై 16 :** కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కుతున్నాయి. ఇప్పటికే యశ్ నటిస్తున్న 'టాక్సిక్', ఎన్టీఆర్ నటిస్తున్న లి'డ్రాగన్' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న ఆమెకు తాజాగా రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందనున్న 'ధర్మన్ – ది డెడ్లీ డాక్టర్' చిత్రంలోనూ కీలక పాత్ర లభించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యంతో సాగుతుందని సమాచారం. సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేపట్టగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ సమకూరుస్తున్నారు. వరుసగా ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి వసంత్ ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో అత్యంత బిజీ కథానాయికలలో ఒకరిగా నిలుస్తున్నారు.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com